పాయకరావుపేటలో ప్రజాగళం సభకు హాజరైన అశేష ప్రజానీకం



బాబుకు బ్రహ్మరథం

పాయకరావుపేట ప్రజాగళం సభకు పోటెత్తిన జనం



కమలం, సైకిల్ గుర్తులను చూపుతున్న చంద్రబాబు, చిత్రంలో పాయకరావుపేట కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిని అనిత, అనకాపల్లి కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ ఉన్నారు

- టీడీపీ అధినేతపై దారిపొడవునా పూల వర్షం
- ప్రసంగానికి విశేష స్పందన
- తాండవ, ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీల పరిరక్షణకు కృషి చేస్తానని చంద్రబాబు హామీ
- సభ విజయవంతం కావడంతో కూటమి శ్రేణుల్లో ఉత్సాహం

... మరిన్ని ఫొటోలు, వార్తలు 7వ పేజీలో

పాయకరావుపేట/రూరల్, ఏప్రిల్ 14: పాయకరావుపేటలో ఆదివారం జరిగిన ప్రజాగళం సభకు జనం పోటెత్తారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. మధ్యాహ్నం నుంచి నక్కపల్లి, కోటవురట్ల, ఎస్.రాయవరం మండలాల నుంచి భారీగా జనం కదలి వచ్చారు. పాయకరావుపేటలో ... మిగతా 8వ పేజీలో



మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

పాయకరావుపేటను అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తా..

పాయకరావుపేట: భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి రోజున పాయకరావుపేట నియోజకవర్గానికి రావడం అదృష్టంగా భావిస్తున్నానని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పాయకరావుపేట ప్రాంతాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించే బాధ్యత తీసుకుంటామని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పాయకరావుపేట సూర్యామహల్ జంక్షన్‌లో నిర్వహించిన ప్రజాగళం సభలో చంద్రబాబు మాట్లాడారు. ముందుగా బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అశేషంగా హాజరైన ప్రజలను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడుతూ గతంలో ఇక్కడ ఒక ఎమ్మెల్యే ఉండేవాడని, ఆయన ఈ ప్రాంతాన్ని ఊడ్చేశాడని ఆరోపించారు. ప్రస్తుతం ఆయన ఎక్కడున్నాడో తెలియదన్నారు. ఇక్కడ ఏమీ మిగలకుండా చేశాడని, ఇప్పుడు కొత్తగా ఒక ఎమ్మెల్యే ఇక్కడికి అభ్యర్థిగా వచ్చాడని, ఆయన ఎక్కడ నుంచి ప్యారాచూట్ వేసుకొని వచ్చాడో తెలియదని ఎద్దేవా చేశారు. అక్కడ ఆ ఎమ్మెల్యే చెత్త అయితే ఇక్కడకు వస్తే బంగారం అవుతాడా? అని పరోక్షంగా వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని ఉద్దేశించి విమర్శలు గుప్పించారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో ఏపీఐఐసీలో 8 వేల ఎకరాలు భూసేకరణ జరిపామన్నారు. మళ్లీ అధికారంలోకి రాగానే పరిశ్రమలు తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ ఈ ప్రాంతాన్ని గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తయారు చేసే అవకాశం ఉందన్నారని, ఆ దిశగా చర్యలు చేపట్టే బాధ్యత తీసుకుంటామన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే సమర్థుడైన కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌ను ఎన్నుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.



చంద్రబాబుకు మగ్గం బహూకరిస్తున్న చేనేత కార్మికులు

ఆధ్యాత్మిక కేంద్రంగా ఉపమాక

- పాయకరావుపేట సభలో చంద్రబాబు హామీ

నక్కపల్లి: ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పాయకరావుపేట నియోజకవర్గంలో ప్రధాన సమస్యలను పరిష్కరిస్తానని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. ఆదివారం సాయంత్రం పాయకరావుపేటలో నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడారు. ఉపమాకలో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతానని ఆయన హామీ ఇచ్చారు. తన హయాంలోనే విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములు సేకరించామని, వైసీపీ ప్రభుత్వం ఒక్క పరిశ్రమను కూడా ఏర్పాటు చేయలేదన్నారు. మళ్లీ తమ ప్రభుత్వం వచ్చాక పరిశ్రమలను తీసుకువచ్చి ఇక్కడున్న వారికే ఉపాధి, ఉద్యోగవకాశాలు కల్పిస్తానని చెప్పారు. మత్స్యకారులకు సంబంధించి జెట్టీలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తానన్నారు. నియోజకవర్గంలో వున్న తాండవ, ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీలను పరిరక్షించుకోవడం కోసం ఎటువంటి చర్యలు చేపట్టాలో ఆలోచిస్తామని చంద్రబాబు చెప్పారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా బత్తుల తాతయ్యబాబు

- మరికొందరికి కీలక బాధ్యతలు



బత్తుల తాతయ్యబాబు



దాడి వీరభద్రరావు



బుద్ద నాగజగదీశ్వరరావు



దాడి రత్నాకర్

అనకాపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా బత్తుల తాతయ్యబాబు నియమితులయ్యారు. ఆయన టీడీపీ చోడవరం నియోజవర్గ ఇన్‌చార్జిగా ప్రస్తుతం కొనసాగుతున్నారు. 2006 నుంచి 2011 వరకు ఆయన బుచ్చెయ్యపేట ఎంపీపీగా బాధ్యతలు చేపట్టారు. 2020లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా, ఇదే సంవత్సరంలో చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టి కొనసాగుతున్నారు. జిల్లాలో ఆయనతోపాటు పలువురు పార్టీ సీనియర్ నాయకులకు కీలక బాధ్యతలను అప్పగిస్తూ ఆదివారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాకు చెందిన మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత దాడి వీరభద్రరావును ఎన్నికల సంఘం, పత్రికా సమావేశాల (కేంద్ర కార్యాలయం) సమన్వయకర్తగా నియమించారు. ప్రస్తుతం టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న బుద్ద నాగజగదీశ్వరరావును, మరో సీనియర్ నేత దాడి రత్నాకర్‌ను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులుగా నియమించారు. నర్సీపట్నానికి చెందిన సీనియర్ నేత బోలెం ముత్యాలపాపను పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు.

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్

- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని, ఏ తరం వారికైనా ఆయన సూచించిన మార్గం ఆదర్శమని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి హాజరై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డీడీ అజయ్‌బాబు, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు. - అనకాపల్లి కలెక్టరేట్

దర్జాగా 10 ఎకరాలు కబ్జా

కొబ్బరి, మామిడి, మునగ తోటల సాగు



ఆక్రమిత స్థలంలో గల పెద్ద బావి

- రెండు పెద్ద బావుల్లోని నీరు విక్రయం
- ఆక్రమణదారుడు వైసీపీ నాయకుడు కావడంతో పట్టించుకోని ఏపీఐఐసీ అధికారులు

అచ్యుతాపురం, ఏప్రిల్ 14:

ఏపీఐఐసీకి చెందిన సుమారు పదెకరాల భూమిని దర్జాగా ఓ వైసీపీ నాయకుడు ఆక్రమించి వ్యవసాయంతో పాటు నీటి విక్రయాలు జరుపుతున్నా, పట్టించుకునే నాథుడు కరువయ్యాడు.

అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలో ఏపీఐఐసీ గతంలో సుమారు పది వేల ఎకరాల భూమిని సేకరించింది. రైతుల నుంచి సేకరించిన భూములకు పరిహారంతో పాటు పునరావాసం కూడా కల్పించింది. రైతుల నుంచి సేకరించిన భూమిని ప్లాట్లుగా విభజించి వివిధ కర్మాగారాలకు ఇవ్వగా, కొంత భూమి ఖాళీగా ఉంది. మారుమూల ఖాళీగా ఉన్న సుమారు పదెకరాల భూమిపై వైసీపీ నాయకుడి కన్ను పడింది. ఆ భూమిలో రెండు పెద్ద బావులతో పాటు ఏపుగా పెరిగిన కొబ్బరి తోట ఉంది. మధ్యలో మామిడి చెట్లు కూడా ఉన్నాయి. దీంతో ఆ నాయకుడు కొబ్బరి తోటల మధ్యలో పాకలు వేసి తన కుటుంబ సభ్యులను పెట్టాడు. 35 వరకు గేదెలను కొని అక్కడే ఉంచాడు. బావుల్లో నీరుండడంతో బావులు పక్కనే హైబ్రీడ్ మునగ తోటను వేశాడు. ఈ భూమి ఏపీఐఐసీకి రాక ముందు రాంబిల్లి మండలం గురజాపాలెం పరిధిలో ఉండేది. అప్పట్లో సాగు రైతులకు భూమితో పాటు బావులు, కొబ్బరి, మామిడి, జీడి చెట్లకు కూడా పరిహారం ఇచ్చారు. ప్రస్తుతం అధికార పార్టీ నాయకుడి ఆక్రమణలో ఉన్న కొబ్బరిచెట్లు, మామిడి చెట్ల ఫలసాయం ఏపీఐఐసీకి చెందాలి. కానీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆ నాయకుడు దర్జాగా ఇక్కడ సాగుచేస్తున్నాడు. సెజ్‌లో గల ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్) వెనుక భాగంలో ఈ భూమి ఉండడంతో బయట ఎవరికీ ఇక్కడ సాగుచేస్తున్న విషయం తెలియదు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో రెండు బావుల వద్ద రెండు డీజిల్ ఇంజన్లు పెట్టి నీళ్ల ట్యాంకర్లలో నింపి సెజ్‌లో కర్మాగారాలకు విక్రయిస్తున్నారు. నిర్మాణంలో ఉన్న కర్మాగారాలకు నీరు బాగా అవసరం కావడం వల్ల ట్రాక్టర్ ట్యాంకర్ నీరు వెయ్యికి కొనుగోలు చేస్తున్నారని తెలిసింది. ప్రస్తుతం ఏపీఐఐసీ వేసిన ప్రధాన రోడ్డు నుంచి నాయకుడు సాగుచేస్తున్న భూమి వరకు రోడ్డు కూడా వేయడం ప్రారంభించారు. సుమారు పదెకరాల భూమిలో సాగు చేస్తున్నా ఏపీఐఐసీ అధికారులు తమకు ఏమీ తెలియనట్టు ఉండడం గమనార్హం. ఏపీఐఐసీ భూముల పరిధిలో ఏర్పాటు చేసిన కర్మాగారాల వద్ద ఎవరైనా పేదలు తోపుడు బళ్లతో బడ్డీకొట్టు పెట్టుకున్నా ఏపీఐఐసీ అధికారులు పీకి పారేస్తున్నారు. కానీ సుమారు పదెకరాల భూమిని కబ్జా చేసి దర్జాగా సాగుచేస్తున్నా అధికారులు ఎందుకు వదిలేశారో అర్థం కావడం లేదు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి భయపడి ఏపీఐఐసీ అధికారులు చూసీచూడనట్టు వదిలేశారని ఈ ప్రాంతీయులు అంటున్నారు.



ఆక్రమణలో ఉన్న కొబ్బరితోట

నిప్పుల కొలిమి

అనకాపల్లిలో 39.0 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు



సందడి లేని అనకాపల్లి నెహ్రూచౌక్

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 14: అనకాపల్లిలో భానుడు నిప్పులు చెరిగాడు. దీనికి తోడు వడగాడ్పులు భారీగా వీయడంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. ఆదివారం అత్యధిక ఉష్ణోగ్రత 39.0, అత్యల్ప ఉష్ణోగ్రత 24.5 డిగ్రీలుగా నమోదైనట్టు స్థానిక వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. శనివారం 37.8 డిగ్రీలుగా ఉన్న ఉష్ణోగ్రత ఆదివారానికి 39 డిగ్రీలకు పెరగడం విశేషం. ఆదివారం ఉదయం ఎనిమిదిన్నర గంటల నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంది. వడగాడ్పుల వీయడంతో మధ్యాహ్నం ఒంటిగంటన్నర సమయంలో పట్టణంలోని ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి.



నిర్మానుష్యంగా ఉన్న అనకాపల్లి- చోడవరం రోడ్డు

రూ.2 లక్షల నగదు సీజ్

- ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్న పోలీసులు



ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.2 లక్షలను పోలీసులకు అప్పగిస్తున్న దృశ్యం

సబ్బవరం, ఏప్రిల్ 14: ఎటువంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.2 లక్షల నగదును శనివారం రాత్రి ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ లీడర్ షేక్ బాబూరావు ఆధ్వర్యంలో సిబ్బంది జాతీయ రహదారి ఆదిరెడ్డిపాలెం పెట్రోల్ బంకు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. పినగాడి నుంచి సబ్బవరం వస్తున్న కారును తనిఖీ చేశారు. ఆ కారులో రూ.2 లక్షల నగదు ఉండడాన్ని గుర్తించారు. ఆ కారులో ఉన్న సిమెంట్ వ్యాపారి ఆదిరెడ్డి ఉమామహేశ్వరరావు ఆ నగదుకు ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. సరైన ఆధారాలు చూపించి నగదును తీసుకువెళ్లవచ్చని ఫ్లయింగ్ స్క్వాడ్ లీడర్ బాబూరావు తెలిపారు. తనిఖీలో ఏఎస్ఐ కె.కుమార్, సురేశ్ పాల్గొన్నారు.


పాయకరావుపేట సభకు హాజరైన ప్రజానీకానికి అభివాదం చెబుతున్న టీడీపీ అధినేత చంద్రబాబు


పాయకరావుపేట ప్రజాగళం సభలో మాట్లాడుతున్న సీఎం రమేశ్



పాయకరావుపేట సభకు హాజరైన అశేష ప్రజానీకం

ప్రజాగళం.. జన సంద్రం

పాయకరావుపేటలో ఆదివారం నిర్వహించిన ప్రజాగళం సభ జన సంద్రంలా మారింది. వృద్ధులు, యువకులు, మహిళల రాకతో పాయకరావుపేట సూర్యమహల్ జంక్షన్ కిటకిటలాడింది. హెలిప్యాడ్ నుంచి సభా జరిగే జంక్షన్ వరకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుపై దారిపొడవునా పూలవర్షం కురిపించారు. చంద్రబాబుకు తమలపాకులతో తయారు చేసిన గజమాలతో రైతులు సత్కరించారు. చేనేత కార్మికులు మగ్గం బహూకరించారు. చంద్రబాబు రోడ్డు షోతో పాయకరావుపేట వీధులన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. బాబు ప్రసంగం ఆద్యంతం యువకులు కేరింతలు కొడుతూ సందడి చేశారు. సైకో పోవాలి.. సైకిల్ రావాలంటూ నినాదాలు చేస్తూ టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలను పట్టుకొని మద్దతు తెలిపారు. -ఆంధ్రజ్యోతి, అనకాపల్లి



నా తొలి ఓటు చంద్రబాబుకే వేస్తామని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యువకులు




గాజువాక సభకు భారీ సంఖ్యలో హాజరైన మహిళలు


చంద్రబాబునాయుడుకు రాజ్యాంగాన్ని బహూకరిస్తున్న అనిత, సీఎం రమేశ్


గాజువాక సభలో ప్రసంగిస్తున్న విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, పల్లా శ్రీనివాస్


జాలర్లు బహూకరించిన వలలతో చంద్రబాబునాయుడు


చంద్రబాబు ప్రసంగానికి చేతులు ఎత్తి మద్దతు తెలుపుతున్న యువకులు


పోలీసుల నిఘా నీడలో పాయకరావుపేట సభ


చంద్రబాబు సభలో సీబీఎం ఆర్మీ

క్రైం... crime news

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి


రాము (ఫొటో)

అచ్యుతాపురం, ఏప్రిల్ 14: మండలంలోని తిమ్మరాజుపేటలో విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ ఐతంశెట్టి రాము (38)ఆదివారం మృతి చెందాడు. కొండకర్ల ఆవ వద్ద గల ఒక రిసార్ట్‌లో విద్యుత్ వైరింగ్ చేస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై పై అంతస్తు నుంచి కింద పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయమైంది. చికిత్స నిమిత్తం అనకాపల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. రాముకు భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారంతో పరారీ

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 14: నగలు తయారు చేసి ఇస్తానని బంగారంతో పరారైన గోల్డ్‌స్మిత్‌పై శనివారం రాత్రి కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ ఆదివారం తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక గవరపాలెం కొణతాల చిన్నయ్యగారివీధికి చెందిన దాడి లింగేశ్వరరావు అనే వ్యక్తి అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న గోల్డ్‌స్మిత్ బి. భాస్కర సత్యనారాయణకు వస్తువులు తయారు చేయమని బంగారం ఇచ్చాడు. ఫిబ్రవరి ఒకటో తేదీన ఇచ్చిన 56 గ్రాముల బంగారానికి నాలుగు బంగారు గాజులు తయారు చేసి ఇచ్చాడన్నారు. మిగిలిన బంగారంతోపాటు మరో 46 గ్రాములు వస్తువుల తయారీకి ఇచ్చాడు. ఈయనతోపాటు బొడ్డేడ జ్యోతి, చల్లా కుమారి, ఆడారి లావణ్య, మరికొంతమంది మొత్తంగా వివిధ వస్తువుల తయారీకి 300 గ్రాములు బంగారం ఇచ్చారు. అయితే కొంతకాలం నుంచి భాస్కర సత్యనారాయణ అందుబాటులో లేకపోవడంతో ఆయన భార్యను ప్రశ్నించగా.. తన భర్త ఎక్కడికి వెళ్లాడో తెలియదని, వచ్చిన వెంటనే బంగారం ఇస్తారని చెబుతున్నారు. ఇలా కాలయాపన జరగడంతో పరారై పోయి ఉంటాడని భావించి భాస్కర సత్యనారాయణపై పోలీసులకు లింగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

అంబేడ్కర్ జీవితం నేటి యువతకు ఆదర్శం

» ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి


హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయిని జ్ఞాపికతో సత్కరిస్తున్న వీసీ డాక్టర్ సూర్యప్రకాశరావు

సబ్బవరం, ఏప్రిల్ 14: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం నేటి యువతరానికి ఆదర్శమని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి అన్నారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో ఆదివారం జరిగిన డాక్టర్ అంబేడ్కర్ 133వ జయంతి వేడుకలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ శేషసాయి మాట్లాడుతూ.. అంబేడ్కర్ జయంతి భారతదేశం పండగగా అభివర్ణించారు. అనేక సామాజిక, ఆర్థిక అసమానతలను తట్టుకొని ఎదిగి, దేశానికి దిశా నిర్దేశం చూపిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.అనంతరం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయిని వీసీ సూర్యప్రకాశరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ మొట్టమొదటి వీసీ వై. సత్యనారాయణ, రిజిస్ట్రార్ డాక్టర్ నందినీ సీపీ, ఫ్యాకల్టీ కన్వీనర్ డాక్టర్ విశ్వచంద్రనాథ్, కో-కన్వీనర్ డాక్టర్ నిర్మలాదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	419
విజయనగరం	423
శ్రీకాకుళం	423

ప్రజలకు న్యాయం చేసే నేత చంద్రబాబు

» అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్

పాయకరావుపేట, ఏప్రిల్ 14: . రాష్ట్ర ప్రజలకు అన్ని విధాలుగా న్యాయం చేసే నాయకుడు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అని అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్ అన్నారు. ఆదివారం స్థానిక సూర్యమహల్ జంక్షన్‌లో జరిగిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే సీఎంగా చంద్రబాబు మళ్లీ అధికార పగ్గాలు చేపట్టాలన్నారు. జగన్ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వాలు ఏర్పడితే డబుల్ ఇంజిన్ పాలనతో పరిశ్రమలు వస్తాయన్నారు. నేను ఎంపీగా గెలిస్తే నరేంద్రమోదీ ప్రధాని అవుతారని, జగన్ పార్టీ ఎంపీలు గెలిస్తే ఎవరికి మద్దతు ఇస్తారో చెప్పాలన్నారు. గతంలో 22 మంది ఎంపీలను గెలిపిస్తే రాష్ట్రానికి ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ఉపయోగం లేని వైసీపీ ఎంపీలు రాష్ట్రానికి అవసరమా అన్నారు. ఈ ప్రాంతంలో 18 గ్రామాల్లో మత్స్యకారులున్నా, వారి సమస్యలు తీరలేదన్నారు. పాయకరావుపేటలో నిరుపయోగంగా ఉన్న అంబేడ్కర్ పార్కును అభివృద్ధి చేస్తామన్నారు.

రాష్ట్రాన్ని గాడిలో పెట్టగల బెస్ట్ డ్రైవర్ చంద్రన్న: అనిత

రాష్ట్ర అభివృద్ధి కోసం కృషిచేస్తున్న నాయకుడు, రాష్ట్రాన్ని గాడిలో పెట్టగల బెస్ట్ డ్రైవరు నారా చంద్రబాబునాయుడు అని పాయకరావుపేట టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గం టీడీపీకి కంచుకోట అని, 2014-19లో రూ.1500 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనన్నారు. వైసీపీ పాలన ఒక దద్దమ్మ పాలనగా అభివర్ణించారు.

మూడింజిన్ల మహాకూటమి బుల్లెట్ ట్రైన్‌కు చంద్రబాబు డ్రైవర్‌ను చేసుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

పాయకరావుపేట కూడా విశాఖపట్నంలా అభివృద్ధి చెందేందుకు వనరులు ఉండడం అదృష్టంగా భావించాలన్నారు. కాపు సామాజిక వర్గం ఎక్కువగా ఉన్నప్పటికీ వారిని కూడా జగన్మోహన్‌రెడ్డి అన్యాయం చేశాడనడానికి ఉదాహరణలు ఉన్నాయన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా నియోజకవర్గానికి వచ్చిన చంద్రబాబునాయుడికు భారత రాజ్యాంగాన్ని ఆమె బహూకరించారు.

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు

» ఉదయం 6 గంటలకే నిండిన క్యూలైన్లు

» సౌకర్యాలను పరిశీలించిన డీసీ సుజాత

» మొక్కులు చెల్లించుకున్న ప్రజలు


బాలాలయంలో క్యూలైన్‌లో భక్తులను పరిశీలిస్తున్న డీసీ సుజాత


అమ్మవారికి మొక్కులు మొక్కుతున్న భక్తురాలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 14: స్థానిక నూకాంబిక అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కొత్త అమావాస్య జాతర ప్రారంభమైన తొలి ఆదివారం కావడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. తెల్లవారు జామున ఆరు గంటలకు అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించిన తరువాత భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఐదు గంటలు దాటినా ఆలయ ఆవరణలో భక్తుల సందడి తగ్గలేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కోళ్లు పట్టుకుని అమ్మవారికి మొక్కులు మొక్కారు. అలాగే ఆలయ పరిసర ప్రాంతాల్లోని తోటల్లో భక్తులు వంటలు తయారుచేసి అమ్మవారికి నైవేద్యం పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. జాతర అధికారిణి, దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత, ఈవో బండారు ప్రసాద్ క్యూలో ఉన్న భక్తుల సౌకర్యాలను పరిశీలించారు. భక్తులకు చల్లటి తాగునీటిని అందించారు. అలాగే మజ్జిగను కూడా పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కూడా భక్తులకు చల్లటి మజ్జిగను అందజేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పట్టణ సీఐ జి.శంకరరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. అలాగే ఆలయానికి వచ్చే మార్గాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ సీఐ పి.పైడపునాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది ముఖ్య ప్రదేశాల్లో బందోబస్తు నిర్వహించారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడుచుకోవాలి

» కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 14: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో జరిగిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని నిర్మించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అజయ్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

బడుగుల ఆరాధ్య దైవం అంబేడ్కర్

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశంలోని అన్ని వర్గాలకు ఆదర్శమూర్తి బీఆర్ అంబేడ్కర్ అని అన్నారు. మహిళలకు సమున్నతస్థానం కల్పించిన వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ అప్పలరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబుతో బండారు భేటీ

» టీడీపీ అధినేతను కలిసిన గవిరెడ్డి రామానాయుడు


బస్సులో బండారు, ఆయన కుమారుడితో మాట్లాడుతున్న టీడీపీ అధినేత

విశాఖపట్నం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడుతో ఆదివారం ఎయిర్‌పోర్టులో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే, పార్టీ సీనియర్ నేత బండారు సత్యనారాయణమూర్తి భేటీ అయ్యారు. ఎన్నికల సభలకు జిల్లాకు వచ్చిన చంద్రబాబు ఎయిర్‌పోర్టు నుంచి గాజువాక వెళుతుండగా బస్సులో బండారు సత్యనారాయణమూర్తి, అతని కుమారుడు అప్పలనాయుడు, మాడుగుల మాజీ ఎమ్మెల్యే జి.రామానాయుడుతో వేర్వేరుగా సమావేశమయ్యారు. సీట్ల సర్దుబాటులో భాగంగా పెందుర్తి సీటు జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబుకు కేటాయించడంతో కొద్దిరోజులుగా బండారు ఇంటికే పరిమితమయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సూచనతో ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి దామచర్ల సత్య స్వయంగా బండారును ఎయిర్‌పోర్టుకు తీసుకువచ్చి చంద్రబాబుతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా బండారును చంద్రబాబు బుజ్జగించారు. ఏ పరిస్థితుల్లో పెందుర్తి సీటు జనసేనకు కేటాయించామో వివరించారని తెలిసింది. అన్ని విధాలా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అయితే అందుకు బండారు అంగీకరించకుండా బస్సు దిగి వెళ్లిపోయినట్టు సమాచారం.

ఉక్కును కాపాడుకుంటాం

» నాలుగేళ్ల క్రితం అందరం కలిసి ఢిల్లీ వెళదామన్నా

» జగన్మోహన్‌రెడ్డి వైపు నుంచి కనీస స్పందన లేదు

» గాజువాక ప్రజాగళం సభలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు

విశాఖపట్నం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి):

ఎన్నికల తరువాత అధికారంలోకి వచ్చిన వెంటనే ఆంధ్రుల హక్కుగా భావించే విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుంటామని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఆదివారం రాత్రి పాత గాజువాక జంక్షన్‌లో జరిగిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడుతూ సుమారు 23 ఏళ్ల క్రితం అప్పటి ప్రధాని వాజపేయి సాయంతో కష్టాల్లో ఉన్న ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకున్నామని గుర్తుచేశారు. నాలుగేళ్ల క్రితం ప్రైవేటీకరణ ప్రతిపాదన వచ్చినప్పుడు...సీఎం నాయకత్వంలో అందరం కలిసి ఢిల్లీ వెళదామని ప్రతిపాదించానని, కానీ జగన్మోహన్‌రెడ్డి నుంచి కనీస స్పందన లేదన్నారు. అప్పుడు స్పందించని జగన్‌కు ఇప్పుడు ఓటు అడిగే హక్కు ఉందా?...అని చంద్రబాబునాయుడు ప్రశ్నించారు. గాజువాకతోపాటు జిల్లా ప్రజలకు ఇబ్బందిగా ఉన్న అగనంపూడి టోల్‌గేటును ఎత్తివేస్తామని హామీ ఇచ్చారు. గంగవరం పోర్టుతో ఉపాధి కోల్పోయిన దిబ్బపాలెం మత్స్యకారులకు యారాడ వద్ద జెట్టీ నిర్మిస్తామని భరోసా ఇచ్చారు. గాజువాక అంటే తనకు ప్రత్యేకమైన అభిమానమని చంద్రబాబు పేర్కొన్నారు. ఇక్కడ టీడీపీకి పటిష్టమైన నాయకత్వం ఉందన్నారు. బీజేపీ, జనసేన కూడా కలవడంతో వచ్చే ఎన్నికల్లో తిరుగులేదన్నారు. మూడు పార్టీలు సమన్వయంతో పని చేసి మంచి మెజారిటీ సాధించాలన్నారు.

డాక్టర్ యెలినేని రాఘవరావు సేవలు అమోఘం

▸▸ ప్రభుత్వ రిటైర్డ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మన్మోహన్‌సింగ్



రాఘవరావు రచించిన జీవన తరంగిణి పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు

పాయకరావుపేట, ఏప్రిల్ 14 : సమాజంలో పశుపోషకులను గౌరవంగా నిలబెట్టడానికి డాక్టర్ యెలినేని రాఘవరావు చేసిన కృషి అమోఘమని ప్రభుత్వ రిటైర్డ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ మన్మోహన్‌సింగ్ అన్నారు. ఆదివారం బోవైన్ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఆధ్వర్యంలో శ్రీప్రకాష్ విద్యా సంస్థల ఆవరణలో నిర్వహించిన రైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డాక్టర్ యెలినేని రాఘవరావు చేసిన ప్రయోగాలు పశుపోషణకు అనుకూలమైన యంత్రాల ఆవిష్కరణలు, పశుపోషకుల అభ్యున్నతికి దోహదపడ్డాయన్నారు. ఇక్రిశాట్ రిటైర్డ్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ సి.రవీంద్రనాథ్, రాష్ట్ర పశు సంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ వై.సింహాచలం మాట్లాడుతూ డాక్టర్ యెలినేని రాఘవరావు నిర్వహించిన పలు ప్రయోగాలు, రచించిన అనేక రచనలు అధిక పాలదిగుబడి, పశుపోషణకు పాడి రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా డాక్టర్ యెలినేని రాఘవరావు జీవన తరంగిణి పుస్తకావిష్కరణ చేశారు. తర్వాత యెలినేని రాఘవరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బోవైన్ మిల్క్ ప్రొడ్యూసర్స్ కంపెనీ ఎండీ సీహెచ్‌వీకే.నరసింహారావు, శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, నాబార్డ్ రిటైర్డ్ సీజీఎం పి.మోహనయ్య, డాక్టర్ కె.నరేంద్రబాబు, పంకజ్ బదానా, డాక్టర్ వి.రవీంద్రబాబు, చంద్రశేఖర్, ప్రసన్న కుమార్, డాక్టర్ సింహాచలం, రైతులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న కొత్తఓటు నమోదు గడువు

అనకాపల్లి రూరల్, ఏప్రిల్ 14 : కొత్త ఓటర్ల నమోదుకు కేంద్ర ఎన్నికల సంఘం విధించిన గడువు సోమవారంతో ముగియనుంది. 18 ఏళ్ల నిండిన వారితోపాటు అర్హత ఉన్నప్పటికీ వివిధ కారణాల వలన ఓటరుగా పేరు నమోదు చేసుకోని వారు తమ పేరు ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలి. ఈనెల 15వ తేదీలోగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకుంటేనే త్వరలో జరగనున్న లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటేసే అవకాశం లభిస్తుంది.

అలరించిన లాఫింగ్ క్లబ్ హాస్యం



హాస్యవల్లరి పండిస్తున్న కళాకారులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 14 : స్థానిక వైఎంవీఏ హాల్‌లో లాఫింగ్‌క్లబ్ హాస్యం అలరించింది. ఆదివారం లాఫింగ్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు దాడి వాసు, బొడ్డేడ మురళి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విజయబాబు మాస్టారు ఈల పాట వాయిద్యం ఆకట్టుకుంది. అనంతరం విశాఖపట్నంకు చెందిన ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో పి.ప్రవీణ్‌కుమార్, సీహెచ్. నాగార్జున, ప్రావీణ్య హిమ చేసిన హాస్యవల్లరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. అనంతరం ముఖ్య ప్రోత్సాహకులు సత్యనారాయణస్వామి వారి దేవస్థానం మాజీ చైర్మన్ ధనాల విష్ణుచౌదరి, కొణతాల వెంకటరావు, కొణతాల పూర్ణచంద్రరావు, కాండ్రేగుల సూరి సత్యనారాయణ, కాండ్రేగుల సత్యనారాయణలను సత్కరించారు.

పార్కుల్లో పక్షులకు తిండిగింజలు ఏర్పాటు



కార్యక్రమంలో పాల్గొన్న గ్రీన్‌క్లబ్ సభ్యులు

తుమ్మపాల, ఏప్రిల్ 14 : పట్టణంలోని పలు పార్కుల వద్ద ఆదివారం గ్రీన్‌క్లబ్ సభ్యులు పక్షులకు తిండిగింజలు, తాగునీటి ఏర్పాట్లను చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు కొడుకుల నాగేశ్వరరావు మాట్లాడుతూ జీవ వైవిధ్య సంరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్‌క్లబ్ సభ్యులు కొణతాల ఫణి భూషణ్‌శ్రీధర్, సత్యనారాయణ, మహేష్, పూర్ణచంద్రరావు, రాపేటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్కందజనని అవతారంలో లలితాంబిక

సబ్బవరం, ఏప్రిల్ 14 : మండలంలోని దేవీపురం సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠం ఆధ్వర్యంలో జరుగుతున్న లలితాంబిక నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు ఆదివారం స్కందజనని అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఉదయం పంచదశి మంత్ర పూజ, అభిషేకాలు, సామూహిక కుంకుమ పూజ, లలితా హోమం, లలిత సహస్రనామావళి, సాయంత్రం సిరి జ్యోతి పూజ ఘనంగా నిర్వహించారు. గురుపత్ని అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో శ్రీవిద్యాట్రస్టు నిర్వాహకులు కందర్ప రమా, ప్రభాకర్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

మునగపాకలో వైసీపీ శ్రేణుల మానవహారం

మునగపాక (తుమ్మపాల), ఏప్రిల్ 14 : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన దాడిని నిరసిస్తూ మునగపాకలో ఆదివారం వైసీపీ శ్రేణులు మానవహారం, ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి అమానుషమన్నారు. వైసీపీకి రాష్ట్రంలో ప్రజాదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు.

ఒకేషనల్(ఎంఎల్‌టి)లో స్టేట్ ఫస్టు ర్యాంక్ రజిని



రాంబిల్లి, ఏప్రిల్ 14: ఒకేషనల్(ఎంఎల్‌టి) మొదటి సంవత్సరంలో రాంబిల్లి కేజీబీవీకి చెందిన విద్యార్థిని సీహెచ్ రజిని (482/500) స్టేట్ ఫస్టుర్యాంక్ సాధించిందని ఎంఈవో ఎం.సూర్యారావు, కేజీబీవీ ప్రత్యేకాధికారిణి ప్రమీల ఆదివారం తెలిపారు. ఎంఎల్‌టీ మొదటి సంవత్సరంలో 36 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 23 మంది మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించారన్నారు. స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన రజినిని ఎంఈఓ సూర్యారావు, కేజీబీవీ ప్రత్యేకాధికారి ప్రమీల, కేజీబీవీ అధ్యాపకులు అభినందించారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళులు



అనకాపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కొణతాల, పీలా గోవింద



అనకాపల్లి లక్ష్మీదేవిపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న రత్నాకర్



కోటవురట్ల: రాట్నాలపాలెంలో అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 14 : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఆదివారం వాడవాడలా నిర్వహించారు. అంబేడ్కర్ నగర్‌లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భీమునిగుమ్మంలోని అంబేడ్కర్ విగ్రహానికి కూటమి నాయకులు కొణతాల రామకృష్ణ, పీలా గోవింద సత్యనారాయణ, బుద్ద నాగజగదీశ్వరరావు, సీఎం రిత్విక్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేకును కట్ చేసి అందరికీ పంచారు. అలాగే వీరు నెహ్రూచౌక్, రామచంద్ర థియేటర్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సబ్బవరపు గణేష్, మాదంశెట్టి నీలబాబు, బీఎస్ఎంకే జోగినాయుడు, దూలం గోపి తదితరులు పాల్గొన్నారు. డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనకాపల్లి బార్ అసోసియేషన్‌లో అధ్యక్షుడు శేఖరమంత్రి సాయి వెంకట లక్ష్మణరావు, కార్యదర్శి ఎస్. శ్రీనివాసరావులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఏఎంసీ కాలనీలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమం భానుచందర్ ఆధ్వర్యంలో జరిగింది. లక్ష్మీదేవిపేటలో రేబాక ఇంద్రకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు, రేబాక రామారావు పాల్గొన్నారు. విశ్వహిందూ పరిషత్ సామాజిక సమరసత అభియాన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పలువురు నివాళులు అర్పించారు. సీపీఎం కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నాయకుడు జి. కోటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భీమునిగుమ్మంలోని అంబేడ్కర్ విగ్రహానికి వైసీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కశింకోటలో.. మండల కేంద్రంలో డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేకు కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో డొమ్మేటి సత్యారావు, వేగి దొరబాబు, వేగి గోపీకృష్ణ, దాసరి బాబు, వేగి పవన్‌కుమార్, బోని గణేష్, రేబాక మధు పాల్గొన్నారు. అలాగే కశింకోట హరిజన కాలనీ, రెల్లికాలనీలలో ఐద్వా, సీఐటీయూ, పంచాయతీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. చింతలపాలెంలో అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ మండల అధ్యక్షుడు కాయల మురళీధర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి పంద్రాణి శేషు, కారు అప్పారావు, బుదిరెడ్డి చిట్టిబాబు, ఆనాల తాతయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే సోమవరం గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రూ.10వేలు దళిత వాడ అభివృద్ధికి ఆర్థిక సహాయం చేశారు.

తుమ్మపాలలో.. తుమ్మపాలలో అంబేడ్కర్ విగ్రహానికి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.

కోటవురట్లలో.. మండల కేంద్రమైన కోటవురట్ల శివారు రాట్నాలపాలెం పాఠశాల వద్ద జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ అనిల్‌కుమార్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. దళిత నాయకుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని మట్ల గణేష్, ఎం.కృష్ణప్రసాద్, బుకా యేసుదాసు, సాందీప్‌రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కైలాసపట్నం, జల్లూరు, పాములవాక, కె.వెంకటాపురం, తంగేడు, యండపల్లి గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జానకిశ్రీనివాసరావు, పినపాత్రుని గుర్రయ్యదొర, తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో.. స్థానిక ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కంబాల జోగులు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ మండల అధ్యక్షుడు శీరం నరసింహమూర్తి, సర్పంచ్ జయరత్నకుమారి పాల్గొన్నారు. మండలంలోని చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి కె.జనార్దన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు జరిగాయి.

అచ్యుతాపురంలో.. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతిని ఆదివారం అచ్యుతాపురం, మడుతూరు, మల్లవరంలలో ఘనగా జరిపారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం, రొంగలి రాము పాల్గొన్నారు.

రాంబిల్లిలో.. మండలంలోని రాంబిల్లి, కొత్తూరు గ్రామాల్లో ఆదివారం రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంత్రిని ఘనంగా నిర్వహించారు. కొత్తూరు ఎస్సీ కాలనీలో దళిత బహుజన నాయకులు జేసీ రామకృష్ణ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు ఉపసర్పంచ్ జల్లూరి వెంకట రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జల్లూరి చంద్రరావు, వార్డు మెంబరు ఆర్.రాము తదితరులు పాల్గొన్నారు. రాంబిల్లిలో అంబేడ్కర్ చిత్రపటానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు, మండల కన్వీనర్ చందక రామకృష్ణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నేత వై.రాము, మహిళలు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో.. మండలంలోని గోకులపాడులో అంబేడ్కర్ విగ్రహానికి పీఆర్‌టీయూ మండల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే వమ్మవరం, వేమగిరి గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహానికి సీపీఎం మండల నేత ఎం. సత్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు భద్రరావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, మండల సమన్వయకర్త సత్యనారాయణ, జి. రమణ, జి. అంజి, మాణిక్యాలరావు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ జయంతి వేడుకలు ఆదివారం వాడవాడలా ఘనంగా జరిగాయి. స్థానిక కంటోన్మెంట్ ఏరియా, పాత పంచాయతీ కార్యాలయం, తదితర ప్రాంతాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు దళిత నాయకుడు గారా ప్రసాద్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అలాగే స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మారుతినారాయణ చక్రవర్తి, మోర్త సింహాచలం, మద్దూరి ప్రకాష్ పాల్గొన్నారు.

ఎలమంచిలిలో.. ఎలమంచిలి పట్టణంతోపాటు ఏటికొప్పాక తదితర గ్రామాల్లో రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్.అంబేడ్కర్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. దిమిలి రోడ్డు జంక్షన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి స్థానిక ప్రజాప్రతినిధులు, దళిత నేతలు, ఎల్ఐసీ బ్రాంచి మేనేజరు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏటికొప్పాకలో అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కాండ్రకోట చిరంజీవి, వైసీపీ నేత శానాపతి రాము, మాజీ సర్పంచ్ బాబ్జీ పూలమాల వేసి నివాళులర్పించారు.

సబ్బవరంలో.. మండలంలోని పలు గ్రామాల్లో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మొగలిపురంలో విశాఖ జిల్లా టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ, ఆరిపాకలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, సబ్బవరంలో సర్పంచ్ దెడ్డం ప్రసారావు, గండి రవి, కర్రిబాబు, ఐడీ బాబు, డి. శ్రీను, దెడ్డం పద్మావతి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పాయకరావుపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దళిత నాయకులు



సబ్బవరం: మొగలిపురంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న గండి బాబ్జీ



అచ్యుతాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

ఘనంగా అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



అనకాపల్లిలో బ్రోచర్‌ను ఆవిష్కరించిన అగ్నిమాపక అధికారులు, సిబ్బంది



పరవాడలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా తదితరులు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 14 : పట్టణంలో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్థానిక అగ్నిమాపక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విధి నిర్వహణలో అశువులు బాసిన సిబ్బందికి అగ్నిమాపక జిల్లా అధికారి ఆర్‌వీ రమణ నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఎంఆర్ సంస్థ మేనేజర్ సతీష్ బ్రోచర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి బి. నరసింగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పరవాడలో.. అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా పిలుపునిచ్చారు. ఆదివారం ప్లాంట్‌లో ఏర్పాటు చేసిన అగ్నిమాపక వారోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. అగ్నిమాపక శాఖలో సేవలందించి అశువులు బాసిన సిబ్బంది, అధికారులకు ఆయన ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాల నివారణకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సింహాద్రి ఎన్టీపీసీ వివిధ విభాగాల జీఎంలు బీబీ పాత్ర, టీఆర్ రాజగోపాలన్, ఏజీఎంలు, సీఐఎస్ఎఫ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఎలమంచిలిలో అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభిస్తున్న దృశ్యం

సబ్బవరంలో.. జాతీయ అగ్నిమాపక వారోత్సవాలను ఫైరాఫీసర్ జీవీ సత్యరాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలు అవాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఎలమంచిలిలో.. స్థానిక అగ్నిమాపక కార్యాలయ ఆవరణలో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాలను వేంకటేశ్వర నర్సింగ్ హోమ్ వైద్యులు సత్యవేణి, అగ్నిమాపక అధికారి రాంబాబు ప్రారంభించారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు. అగ్నిప్రమాదాలు సంభవించిన సమయంలో సమయస్ఫూర్తితో అనుసరించాల్సిన అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

బాబుకు బ్రహ్మరథం

... 5వ పేజీ తరువాయి

మంగవరం రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద చంద్రబాబునాయుడుకు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, పాయకరావుపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత, జిల్లా టీడీపీ అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, తోట నగేశ్, స్థానిక నేతలు చంద్రబాబుకు పూలబొకేలు అందించి ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి సూర్యామహల్ జంక్షన్ ప్రజాగళం సభా ప్రాంగణం వరకు మహిళలు, వృద్ధులు, యువకులు దారిపొడవునా బాబుపై పూలవర్షం కురిపిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. తమలపాకు రైతులు చంద్రబాబును తమలపాకులతో తయారు చేసిన గజమాలతో సత్కరించారు. చేనేత కార్మికులు బాబును కలిసి మగ్గం బహూకరించారు. హెలీప్యాడ్ నుంచి సాగిన ర్యాలీలో బాబు వెంట వేలాది మంది కార్యకర్తలు పాల్గొని జై తెలుగుదేశం, సైకో పోవాలి, సైకిల్ రావాలంటూ నినాదాలతో హోరెత్తించారు. తప్పెటగుళ్ళ, మేళతాళాలతో చంద్రబాబును ప్రజాగళం వేదిక వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సుమారు అర్ధగంట సేపు సాగిన బాబు రోడ్డుషోతో పేట వీధులన్నీ జనంతో కిటకిటలాడాయి. వేలాదిగా హాజరైన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు ప్రసంగాన్ని ఆద్యంతం ఆసక్తిగా ఆలకించారు. అశేషంగా హాజరైన నాయకులు, కార్యకర్తల ఉత్సాహాన్ని చూసి చంద్రబాబు పాయకరావుపేటను జన సంద్రంగా పోలుస్తూ ఈ జనాన్ని చూస్తే తాడేపల్లి పిల్లి గుండెల్లో రైళ్లు పరుగెత్తడం ఖాయమని వ్యాఖ్యానించడంతో జనం ఒక్కసారిగా కేరింతలు, అరుపులతో హోరెత్తించారు. నెల రోజుల్లో జరగబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను గెలిపించి కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి ఆధ్వర్యంలో అభివృద్ధి చేసుకోడానికి సిద్ధమా అని చంద్రబాబు ఇచ్చిన పిలుపునకు సిద్ధమేనంటూ యువకులు, మహిళలు చేతులెత్తి జవాబిచ్చారు. ప్రజాగళం సభ విజయవంతం కావడంతో కూటమి శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది.

13 మద్యం బాటిళ్లు స్వాధీనం

పరవాడ, ఏప్రిల్ 14 : మండలంలోని తిక్కవానిపాలెం గ్రామానికి చెందిన సూరాడ సత్తయ్య ఆదివారం రాత్రి వాడచీపురుపల్లిలోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి 13 మద్యం క్వార్టర్ బాటిళ్లు కొనుగోలు చేసి తీసుకువెళ్తుండగా పట్టుకున్నట్టు ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు. ఆయనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

వేంపాడు చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



వేంపాడు చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

నక్కపల్లి, ఏప్రిల్ 14: మండలంలోని వేంపాడు హైవే టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్ట్‌ను ఆదివారం రాత్రి జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగదు, ఉచిత కానుకలు, మద్యం, మత్తు పదార్థాల అక్రమ రవాణాను అడ్డుకోవాలన్నారు. చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ప్రజలకు అవగాహన కల్పించాలని సీఐ విజయ్‌కుమార్‌కు సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని ఎస్పీ మురళీకృష్ణ కోరారు.

సప్తాహంతో ఆధ్యాత్మిక పరిమళం

నక్కపల్లి, ఏప్రిల్ 14: మండలంలోని ఉపమాకలో జరుగుతున్న 168 గంటల సప్తాహం ఆధ్యాత్మిక శోభతో అలరిస్తున్నది. ఈనెల 10వ తేదీన ప్రారంభమైన సప్తాహం 17వ తేదీ ఉదయం 6 గంటలతో ముగుస్తుంది. వివిధ భజన సంఘాల ప్రతినిధులు భక్తిగీతాలతో రామ నామస్మరణ చేస్తున్నారు. ఉపమాక శ్రీనివాసా భజన భక్త సమాజం, మెరకవీధి కోదండరామాలయం, గ్రామపెద్దల ఆధ్వర్యంలో సప్తాహ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఆదివారం బైరిపురం, పీఎస్ఆర్‌పేట, ధర్మవరం, మంగవరం, పీఎల్‌పురం భజన సమాజాల గాయనీ,గాయకులు భక్తిగీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా భజన సమాజాల గురువులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

నేడు వెంకటాపురంలో రామాలయం ప్రారంభం



నూతన రామాలయం ఇదే

రాంబిల్లి, ఏప్రిల్ 14: మండలంలోని వెంకటాపురంలో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని సోమవారం ప్రారంభించనున్నారు. మహా గణపతి, శ్రీకృష్ణభగవాన్ సహిత హనుమాన్, సీత, లక్షణ పరివార సమేత శ్రీరామచంద్రమూర్తి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరగనుందని ఉత్సవ కమిటీ చైర్మన్, గ్రామ సర్పంచ్ కిల్లాడి తాతబ్బాయి తెలిపారు. ఉదయం నుంచి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు, హోమాలు జరగనున్నాయన్నారు.ఈ ఆలయానికి స్థలదాత, ధర్మకర్త రోమాల మూలరాజు అని ఆయన తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేయాలని గ్రామ సర్పంచ్ తాతబ్బాయి తెలిపారు.

375 మందికి ఉచితంగా కంటి పరీక్షలు

అచ్యుతాపురం ఏప్రిల్ 14: బ్రాండిక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 124వ ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆదివారం 375 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 265 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయగా 90 మందికి ఉచితంగా మందులిచ్చారు. 20 మందికి శస్త్ర చికిత్సకు వైద్యులు ఎంపిక చేశారు. వీరికి విశాఖ శంకర్ ఫౌండేషన్‌లో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని బ్రాండిక్స్ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం శిబిరంలో పాల్గొన్న వారందరికీ ఉచితంగా అల్పాహారం, మజ్జిగ, భోజనాలు ఏర్పాటుచేశారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ పిన్నింటి రమణ

సబ్బవరం, ఏప్రిల్ 14 : స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సబ్బవరం వాసవీ క్లబ్ (రూరల్) ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక సీఐ పిన్నింటి రమణ ప్రారంభించారు. తొలి రోజు మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మండుటెండల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు కొప్పాక శేషు చలివేంద్రం నిర్వహణకు రూ.5 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు బీవీఎన్ రామారావు, కార్యదర్శి అయ్యప్ప, ట్రెజరర్ సంతోష్ పాల్గొన్నారు.

వైసీపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయం ప్రారంభం




జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సుబ్బారెడ్డి

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 14: స్థానిక వివేకానందనగర్‌లో ఆదివారం వైసీపీ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల కార్యాలయాన్ని ఆ పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. వివేకానందహాల్‌లో ఏర్పాటు చేసిన కార్యాలయ ప్రారంభోత్సవానికి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, మలసాల భరత్‌కుమార్‌లు హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరాముని పెళ్లిరాట

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 14 : స్థానిక గవరపాలెం దిబ్బవీధిలోని రామాలయం వద్ద శ్రీరాముని పెళ్లిరాటను ఆదివారం ఉదయం వేశారు. అనంతరం మహిళలు పసుపుకొమ్ములను దంచారు. ఆలయ చైర్మన్ దాడి భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీధి పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకున్న అసెంబ్లీ ఈవీఎంలు



ఈవీఎంలను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ఎలమంచిలి, ఏప్రిల్ 14: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌కు చేరుకున్నాయి. వీటిని రాజకీయ పక్షాల నేతలు, అధికారుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి మనోరమ పరిశీలన చేసి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. పోలీసు పహారాను ఏర్పాటు చేశారు.

ఎన్నికల ఈవీఎంలు పరిశీలన

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో ఆదివారం రాజకీయ పక్షాల నాయకుల సమక్షంలో ఈవీఎంలు, వీవీప్యాడ్‌లను అధికారులు పరిశీలన చేశారు. రిటర్నింగ్ అధికారి మనోరమ, ఏఈఓలు, ఇతర అధికారుల సమక్షంలో వీటిని పరిశీలించారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

కొత్తూరు, ఏప్రిల్ 14 : అనకాపల్లి పట్టణంలో ఉన్న డీవీఆర్ కార్యాలయంలో కశింకోట హౌసింగ్ కాలనీకి చెందిన 50 మంది వైసీపీ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలోకి ఆదివారం చేరారు. టీడీపీ నాయకుడు దాడి రత్నాకర్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో 50 మంది యువకులకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వేగి దొరబాబు, వేగి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

నియోజకవర్గ కేంద్రాలకు చేరిన అసెంబ్లీ ఎన్నికల ఈవీఎంలు

▸ స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపర్చిన రిటర్నింగ్ ఆఫీసర్లు



మాడుగుల చేరిన ఈవీఎంలను ఆర్వో సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌కు తరలింపు

నర్సీపట్నం/మాడుగుల, ఏప్రిల్ 14 : నర్సీపట్నం అసెంబ్లీ నియోజవర్గానికి చెందిన ఈవీఎంలను ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. అనకాపల్లి నుంచి ఆదివారం సాయంత్రం 262 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 314 కంట్రోల్ యూనిట్లు, 314 బ్యాలెట్ యూనిట్లు, 340 వీవీ ప్యాడ్స్ ఇక్కడికి చేరాయి. టీడీపీ, వైసీపీ, బీజేపీ నాయకుల సమక్షంలో కంటైనర్ తలుపులను తొలుత తెరిచారు. రిటర్నింగ్ ఆధికారి జయరాం, తహసీల్దార్ శ్రీరాములు, సీఐ కాంతికుమార్‌లు భారీ పోలీస్ బందోబస్తు నడమ ఈవీఎంలు ఉన్న ట్రంక్ పెట్టెలను కంటైనర్ నుంచి బయటకు తీసి స్ట్రాంగ్‌లో భద్రపరిచారు. అలాగే, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎంలు ఆదివారం మాడుగుల చేరాయి. ఎస్ఐ పి.దామోదరనాయుడు పర్యవేక్షణలో సిబ్బంది ఆర్‌సీఎం పాఠశాలకు వాటిని చేర్చారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి జీవీ సత్యవాణి ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకుల సమక్షంలో తొలుత కంటైనర్‌ను తెరిపించారు. అనంతరం ఆయా బాక్స్‌ల్లోని ఈవీఎంలు, 282 కంట్రోల్ యూనిట్స్, 282 బ్యాలెట్ యూనిట్స్, 305 వీవీ ప్యాట్లను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపర్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ టి.సత్యనారాయణ, ఎన్నికల డీటీ ఎం.రాజ, సీనియర్ అసిస్టెంట్ వి.పూర్ణయ్య పాల్గొన్నారు.

నేడు ఎన్నికల నిర్వహణపై అధికారులకు శిక్షణ



మాస్టర్ ట్రైనీస్‌తో సమావేశం నిర్వహిస్తున్న ఆర్వో జయరాం

నర్సీపట్నం, ఏప్రిల్ 14 : ఎన్నికల నిర్వహణపై ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు పక్కాగా శిక్షణ ఇవ్వాలని రిటర్నింగ్ అధికారి హెచ్‌వీ జయరాం సూచించారు. ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం మాస్టర్ ట్రైనీస్‌తో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సోమవారం నుంచి పీవోలు, ఏపీవోలకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఎన్నికల సామగ్రి పంపిణీ దగ్గర నుంచి ఈవీఎంలు వినియోగం వరకు పూర్తి అవగాహన అవసరమన్నారు. ఎన్నికలు ఎటువంటి ఆటంకం లేకుండా నిర్వహించేందుకు అంతా సిద్ధంగా ఉండాలన్నారు.

ఉత్సాహంగా గుర్రపు పరుగు పోటీలు



పోటీని తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు

కృష్ణాదేవిపేట, ఏప్రిల్ 14 : గొలుగొండ మండలం లింగంపేటలో నూకాలమ్మ తీర్థం సందర్భంగా ఆదివారం సాయంత్రం జిల్లాస్థాయి గుర్రపు పరుగు పోటీలు నిర్వహించారు. అనకాపల్లి, విజయనగరం, పాడేరు, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల నుంచి పద్దెనిమిది గుర్రాలను ఆయా యజమానులు తీసుకు వచ్చారు. ప్రథమ బహుమతిని గొలుగొండ మండలం జోగంపేటకు చెందిన చోడమాంబిక విక్రమ్, ద్వితీయ బహుమతిని కోటనందూరుకు చెందిన శివరాజు బ్రదర్స్ గుర్రాలు దక్కించుకున్నాయి. వీరితో పాటు పందాల్లో పాల్గొన్న అందరికీ నగదు బహుమతులను గ్రామ పెద్దలు సంతోష్, నాని, కవి, మల్లేశ్వరావు, మంగరాజు తదితరుల చేతులమీదుగా నిర్వాహకులు అందజేశారు. ఈ పోటీలు జరుగుతున్న సమయంలో లింగంపేట ప్రధాన రహదారిలో లింగంపేట- శ్రీరామ్‌పురం గ్రామాలకు చెందిన ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి స్వల్ప వివాదం చోటుచేసుకుని, కొట్లాటకు దారితీయడంతో పోలీసులు ఇరువర్గాలను శాంతింపజేశారు.

16న బలిఘట్టంలో 'టీడీపీ యువశక్తి'

నర్సీపట్నం, ఏప్రిల్ 14 : టీడీపీ నిర్వహిస్తున్న యువశక్తి పోస్టర్‌ను మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఆదివారం ఇక్కడ ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీరాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ మాట్లాడుతూ బలిఘట్టంలో ఈనెల 16 తేదీన ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ముఖ్యఅతిథులుగా వంగవీటి రాధా, టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి హాజరు కానున్నట్టు తెలిపారు. ఇదిలావుంటే, పెదబొడ్డేపల్లిలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల శంఖారావంలో భారీగా వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరారు. వీరికి మాజీ మంత్రి అయ్యన్న కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ళ జగన్ పాలన తీరును ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సుకల రమణమ్మ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాబుకు బ్రహ్మరథం

... 5వ పేజీ తరువాయి

మంగవరం రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద చంద్రబాబునాయుడుకు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్, పాయకరావుపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత, జిల్లా టీడీపీ అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి, తోట నగేశ్, స్థానిక నేతలు చంద్రబాబుకు పూలబొకేలు అందించి ఘన స్వాగతం పలికారు. అక్కడ నుంచి సూర్యామహల్ జంక్షన్ ప్రజాగళం సభా ప్రాంగణం వరకు మహిళలు, వృద్ధులు, యువకులు దారిపొడవునా బాబుపై పూలవర్షం కురిపిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. తమలపాకు రైతులు చంద్రబాబును తమలపాకులతో తయారు చేసిన గజమాలతో సత్కరించారు. చేనేత కార్మికులు బాబును కలిసి మగ్గం బహూకరించారు. హెలీప్యాడ్ నుంచి సాగిన ర్యాలీలో బాబు వెంట వేలాదిమంది కార్యకర్తలు పాల్గొని జై తెలుగుదేశం, సైకో పోవాలి, సైకిల్ రావాలంటూ నినాదాలతో హోరెత్తించారు. తప్పెటగుళ్ళు, మేళతాళాలతో చంద్రబాబును ప్రజాగళం వేదిక వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సుమారు అర్థగంట సేపు సాగిన బాబు రోడ్డుషోతో పేట వీధులన్నీ జనంతో కిటకిటలాడాయి. వేలాదిగా హాజరైన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు ప్రసంగాన్ని ఆద్యంతం ఆసక్తిగా ఆలకించారు. అశేషంగా హాజరైన నాయకులు, కార్యకర్తల ఉత్సాహాన్ని చూసి చంద్రబాబు పాయకరావుపేటను జన సంద్రంగా పోలుస్తూ ఈ జనాన్ని చూస్తే తాడేపల్లి పిల్లి గుండెల్లో రైళ్లు పరుగెత్తడం ఖాయమని వ్యాఖ్యానించడంతో జనం ఒక్కసారిగా కేరింతలు, అరుపులతో హోరెత్తించారు. నెల రోజుల్లో జరగబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను గెలిపించి కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి ఆధ్వర్యంలో అభివృద్ధి చేసుకోడానికి సిద్ధమా అని చంద్రబాబు ఇచ్చిన పిలుపునకు సిద్ధమేనంటూ యువకులు, మహిళలు చేతులెత్తి జవాబిచ్చారు. ప్రజాగళం సభ విజయవంతం కావడంతో కూటమి శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది.

ఇన్నేళ్లుగా మొక్కుబడి.. ఎన్నికల వేళ హడావుడి..!

▸ ఆరిలోవ అటవీ ప్రాంతంలో మళ్లీ ఎట్టకేలకు రోడ్డు విస్తరణ ప్రారంభం ▸ గత ఎన్నికల ముందు ఎమ్మెల్యే గణేశ్ ఈ పనులపై హామీ ▸ మధ్యలో ప్రారంభించినా బిల్లులు మంజూరు కాక నిలిపివేత
▸ ఇన్నాళ్లూ దుమ్ము, ధూళి, రాళ్లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న వాహనచోదకులు ▸ కనీసం ఈ సారైనా పూర్తిచేయాలని అంతా వేడుకోలు

ఆ ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులు ఎప్పుడు పూర్తవుతాయా... అని ఏళ్లతరబడి ఎదురు చూస్తున్న వాహనచోదకుల కల ఎట్టకేలకు నెరవేరనుంది. గత ఎన్నికల ముందుకు ఈ పనుల విషయమై హామీ ఇచ్చిన ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ దాదాపు ఐదేళ్ల అనంతరం ఇప్పుడు ఎన్నికలు జరుగుతున్న తరుణంలో పూర్తిస్థాయిలో దృష్టి పెట్టడంతో ఇన్నాళ్లకు పునఃప్రారంభమయ్యాయి. ఇప్పటికైనా పూర్తిచేస్తారా..లేక గతంలో వలే అర్థంతరంగా నిలిపివేస్తారా.. అన్న సందేహాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఇంతలా వాహనచోదకులను మీమాంసకు గురిచేసిన రోడ్డు విస్తరణ పనులకు సంబంధించిన వివరాలివి.



అర్థంతరంగా విస్తరణ పనులు నిలిచిపోవడంతో ఎగసిడిన దుమ్ము, ధూళి మధ్య వాహనాల రాకపోకలు (ఫైల్)

గొలుగొండ, ఏప్రిల్ 14 : నర్సీపట్నం నుంచి గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట వరకు గతంలో రోడ్డు అస్తవ్యస్తంగా ఉండేది. ఇది గుర్తించిన అయ్యన్నపాత్రుడు టీడీపీ హయాంలో మంత్రిగా ఉన్న సమయంలో 2017లో ఈ 24 కిమీ రోడ్డు విస్తరణకు ప్రపంచ బ్యాంకు నిధులు రూ.24 కోట్లు మంజూరు చేయించారు. దీంతో రోడ్డు విస్తరణ పనులు చకచకా సాగాయి. అయితే ఆరిలోవ అటవీ ప్రాంతం వద్దకు వచ్చేసరికి రాజులబాబు గుడి నుంచి పప్పుశెట్టిపాలెం జంక్షన్ వరకు నాలుగు కిలోమీటర్లు విస్తరణ పనులకు బ్రేక్ పడింది. ఇందుకు అటవీ శాఖ అనుమతులు మంజూరు చేయడం ఆలస్యమైంది. ఇంతలో ఎన్నికలు రావడంతో పనులు ముందుకు సాగలేదు. దీంతో 2019 ఎన్నికల్లో వైసీపీ తరఫున నర్సీపట్నం ఎమ్మెల్యేగా పోటీ చేసిన పెట్ల ఉమాశంకర్ గణేశ్ తాను ఎన్నికల్లో గెలిస్తే ఆరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చింది. ఆ తరువాత చాన్నాళ్లపాటు ఈ రోడ్డు విస్తరణ ఊసేలేదు. ఆ తరువాత 2022లో అటవీ శాఖకు పాకలపాడు రెవెన్యూలో ఐదు ఎకరాల స్థలంతో పాటు రూ.50లక్షలు చెల్లించడంతో రోడ్డు పనులకు సదరు శాఖ అధికారులు అనుమతులు మంజూరు చేశారు. ఫలితంగా 2023లో రాజులబాబు గుడి నుంచి పప్పుశెట్టిపాలెం జంక్షన్ వరకు 12 అడుగులు ఉన్న రోడ్డును 24 అడుగులుగా విస్తరణ చేసే పనులకు ఎమ్మెల్యే గణేశ్ భూమి పూజ చేశారు. దీంతో ఈ రోడ్డులో తమ కష్టాలు తీరుతాయని వాహనచోదకులు భావించారు. రోడ్డు విస్తరణలో భాగంగా నాలుగు కిలో మీటర్లకు ఇరువైపులా క్రషర్ బుగ్గి, వెట్ సిమెంట్ మిక్చర్‌తో కలిపి మీటరులోతున గత ఏడాది కప్పారు. ఆ తరువాత బిల్లులు మంజూరు కాలేదని సదరు కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు. దీంతో రోడ్డుపై ఎక్కడికక్కడ రాళ్ల



ప్రస్తుతం పనులు జరుగుతున్న దృశ్యం

తేలి రాకపోకలకు వాహనచోదకులు ప్రత్యక్ష నరకాన్ని చూశారు. లారీలు, బస్సులు, వ్యాన్లు వంటి వాహనాలు వెళ్లే సమయాల్లో దుమ్ము, ధూళి ఎగసి పడడంతో అంతా తీవ్ర అవస్థలు పడేవారు. మళ్లీ సార్వత్రిక ఎన్నికలు దాదాపు నెలరోజుల్లో జరగనుండడంతో ప్రజాప్రతినిధులకు ఈ రోడ్డు విస్తరణ పనులు గుర్తుకు వచ్చాయి. ఈ అటవీ ప్రాంతంలో ఎన్నికలలోపు రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేయకపోతే తలెత్తే సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే గణేశ్ ఆర్‌అండ్‌బీ అధికారులను కలిసి విస్తరణ ఎలాగైనా పూర్తిచేయాలని మొరపెట్టుకున్నట్టు ప్రచారంలో ఉంది. గతంలో చేపట్టిన పనులకు సంబంధించిన రూ.కోటిన్నర బిల్లులు ప్రభుత్వం మంజూరు చేయకపోయినా, మరో కాంట్రాక్టర్‌తో పది రోజుల్లో రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఒత్తిడి తెచ్చినట్టు చెప్పుకుంటున్నారు. ప్రస్తుతం చేపట్టాల్సిన పనులకు సంబంధించిన బిల్లులు ఈ నెలాఖరులోగా మంజూరు చేయించే బాధ్యత తమదని ఆర్‌అండ్‌బీ అధికారులకు ఎమ్మెల్యే భరోసా ఇచ్చారని అంటున్నారు. దీంతో ఆరిలోవ అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులను శనివారం పునఃప్రారంభించారు.

తాజాగా చేపడుతున్న పనులను చూసినవారు ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల నుంచి పూర్తిస్థాయిలో దృష్టిసారించని ప్రజాప్రతినిధులు ఎన్నికల వేళలోనైనా స్పందించారని చర్చించుకుంటున్నారు. కనీసం ఈసారైనా పనులను పూర్తిచేస్తారా... లేక మళ్లీ అర్థంతరంగా నిలిపివేస్తారా.. అంటూ పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాన్ని ఆర్‌అండ్‌బీ మండల జేఈ ప్రసాద్ వద్ద ప్రస్తావించగా, గత ఏడాదిలో చేపట్టిన రోడ్డు విస్తరణకు సంబంధించి రూ.కోటిన్నర బిల్లులు మంజూ కావాల్సి ఉందన్నారు. బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ మధ్యలో పనులను నిలిపివేశారన్నారు. ప్రస్తుతం ప్రజాప్రతినిధుల ఒత్తిడితో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించామని స్పష్టం చేశారు. ఈ నెలాఖరులోగా బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తుందని తమకు భోరోసా ఇచ్చారని వివరించారు.

96 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



భీమబోయినపాలెంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో అయ్యన్నపాత్రుడు

మాకవరపాలెం, ఏప్రిల్ 14 : విజన్ కలిగిన చంద్రబాబు వంటి సమర్థ నాయకుడితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి, టీడీపీ నర్సీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మండలంలోని రాచపల్లి, భీమబోయినపాలెం గ్రామాల్లో ఆదివారం ఎన్నిక ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాచపల్లి పంచాయతీ నుంచి వైసీపీ సీనియర్ నాయకులు రుత్తల జమీందార్, రుత్తల సత్యనారాయణలతో పాటు రాచపల్లి, ఎరకన్నపాలెం, దర్మవరం, కొత్తపాలెం గ్రామాల నుంచి 46 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. అలాగే భీమబోయినపాలెం పంచాయతీ శివారు గండిపేట, చింతలూరు గ్రామాలకు చెందిన వైసీపీ నుంచి 50కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకోవడంతో వీరికి అయ్యన్న కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ మం డల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, భీమబోయినపాలెం సర్పంచ్ నందకిశోర్, శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పొడుగుపాలెంలో....



టీడీపీలో చేరిన వారితో పైలా ప్రసాదరావు

కె.కోటపాడు : ఎ.కోడూరు పంచాయతీ పొడుగుపాలెంలో టీడీపీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రజాగళం కార్యక్రమాన్ని నిర్వహించారు. మాడుగుల నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి పైలా ప్రసాదరావు ఇంటింటికీ వెళ్లి ప్రచారాన్ని నిర్వహించారు. పొడుగుపాలెంలో వైసీపీ నుంచి 24 కుటుంబాలు టీడీపీలో చేరడంతో కండువాలు కప్పి ఆహ్వానించారు. నాయకులు రొంగలి మహేష్, మల్లేశ్వరరావు, సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, మేడిచర్ల మాజీ ఎంపీటీసీ పూడి నారాయణ మూర్తి, సబ్బవరపు రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

లింగాపురంలో పోలింగ్ కేంద్రానికి వినతి

నర్సీపట్నం, ఏప్రిల్ 14 : మునిసిపాలిటీలోని రెండో వార్డు పరిధి లింగాపురంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు కె.గోవిందరావు కోరారు. ఆదివారం గ్రామంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లింగాపురం గ్రామంలో 292 మంది ఓటర్లు ఉన్నారని, ఏడు కిలోమీటర్లు దూరంలోని కృష్ణాపురం వెళ్లి ఓట్లు వేయాల్సి వస్తుందన్నారు. గ్రామంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. కౌన్సిలర్ రామరాజు, పలువురు గిరిజనులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



అవగాహన ర్యాలీలో సిబ్బంది, పట్టణవాసులు

నర్సీపట్నం, ఏప్రిల్ 14 : అగ్ని ప్రమాదాలు, నివారణా చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక అగ్నిమాపక శాఖాధికారి అప్పలస్వామి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విధి నిర్వహణలో మృతి చెందిన అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై కరపత్రాలు పంపిణీ చేశారు.

'తురువోలులో జరగాల్సిన సమావేశం వాయిదా'

చీడికాడ, ఏప్రిల్ 14 : మండలంలో తురువోలు గ్రామంలో సోమవారం నిర్వహించాల్సిన టీడీపీ కార్యకర్తల సమావేశం అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్టు మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని వివరించారు.

మరిడి మహాలక్ష్మి పండగ పోస్టర్ ఆవిష్కరణ



నర్సీపట్నం, ఏప్రిల్ 14 : పట్టణంలో కొలువుదీరిన మరిడి మహాలక్ష్మి అమ్మవారి పండగ కరపత్రాలను మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు ఆదివారం ఇక్కడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం రాత్రికి మొదటి జాగరణ సందర్భంగా గరగలు తీయడం జరుగుతుందన్నారు. 17వ తేదీ రెండో జాగరణ, 19న మూడో జాగరణ, 22వ తేదీన పెద్ద జాగరణ నిర్వహిస్తామని తెలిపారు. 23వ తేదీన అమ్మవారి పండగ జరుగుతుందన్నారు. అందరి సహకారంతోనే పండగ ఘనంగా నిర్వహించుకోగలమన్నారు. ఈ కార్యక్రమంలో చింతకాయల పద్మావతి, చింతకాయల రాజేశ్, గవిరెడ్డి వెంకటరమణ, ధనిమిరెడ్డి మధు, పైల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నలపాలెంలో శ్రీరామ నవమి ఉత్సవాలు



పల్లకీలో స్వామివారి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

నాతవరం, ఏప్రిల్ 14 : వెన్నలపాలెంలో ఉగాది నుంచి శ్రీరామ నవమి ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సీతారామ హరిభజన సమాజం బృందం రోజూ శ్రీరాముని చిత్రపటాన్ని పల్లకీలో ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తున్నారు. ఈ సందర్భంగా స్వామి కీర్తనలను భజన బృందం సభ్యులు ఆలపిస్తున్నారు. ఈ నవరాత్రులు ముగిసిన తర్వాత శ్రీరామనవమి రోజున అన్నసమారాధన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవహక్కుల జిల్లా ప్రధాన కారర్యదర్శి గొంప సత్యనారాయణతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు.

బెన్నవోలులో నవమి ఉత్సవాలకు రాట

చోడవరం, ఏప్రిల్ 14 : మండలంలోని బెన్నవోలులో ఆదివారం శ్రీరామ నవమి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి రాటను వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మజ్జి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మ ఘటాల పండగ



మాడుగుల, ఏప్రిల్ 14 : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత మాడుగుల మోదకొండమ్మ ఘటాల పండగ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు ఘటాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. పూజల అనంతరం అమ్మవారికి సమర్పించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అమ్మవారి ఆలయానికి ఘటాలను ఊరేగింపుగా తీసుకు వస్తున్న భక్తులు

ఘనంగా అంబేడ్కర్ జయంతి



నాతవరంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

చోడవరం, ఏప్రిల్ 14 : భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతిని ఆదివారం వాడవాడలా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ఆధ్వర్యంలో గూనూరు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, మాజీ సర్పంచ్ గిరి, జనసేన నేతలు సిరిపురపు రమేష్ తదితర నేతలు స్థానిక అంబేడ్కర్ భవనం వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ విప్ ధర్మశ్రీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు మండలంలోని పలు గ్రామాల్లో అంబేడ్కర్ జయంతిని జరిపారు. ఎంపీపీ గాడి కాసు, ఎస్సీ సెల్ నాయకులు వేచలపు ప్రకాశ్, వైసీపీ నాయకులు శ్రీకాంత్, చందురాంబాబు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : మండలంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. వడ్డాది, ఎల్‌బీపీ అగ్రహారం, బుచ్చెయ్యపేట, విజయరామరాజుపేటల్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వడ్డాది జంక్షన్‌లో దళిత సంఘాల యువజన అధ్యక్షుడు బూసి కోటి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిపారు. టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, దళిత సంఘాల యువజన అధ్యక్షుడు బూసి కోటి, మాడుగుల వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీను, మాజీ ఎంపీటీసీ సూరాతి పేరమ్మ, మండల టీడీపీ అధ్యక్షుడు గోకివాడ కోటేశ్వరరావు, వడ్డాది పట్టణ టీడీపీ అధ్యక్షుడు దొండా నరేష్ పాల్గొన్నారు.

రావికమతం : అంబేడ్కర్ జయంతిని గ్రామాల్లో నిర్వహించారు. తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్ఐ రమణారావు, భానోజీరావు, ధనుంజయరావులు ఆయా కార్యాలయాలు, పోలీస్ స్టేషన్‌లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే, కొత్తకోటలో సర్పంచ్ కోన లోవరాజు, ఎంపీటీసీ పూడి దేవ, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవా, వైసీపీ, టీడీపీ నాయకులు తలారి ఆదిమూర్తి, శంకరావు, రాజు, బుల్లిబాబు ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు.

రోలుగుంట : అంబేడ్కర్ సమసమాజ నిర్మాణానికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని కేవీపీఎస్ నాయకుడు ఈరెల్లి చిరంజీవి అన్నారు. జె.నాయుడుపాలెంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించి మాట్లాడారు. అలాగే, కొమరవోలు, రోలుగుంట గ్రామాల్లో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఈ వేడుకను జరిపారు.

నర్సీపట్నం/అర్బన్ : అంబేడ్కర్ జయంతిని వాడవాడలా నిర్వహించారు. నర్సీపట్నంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు, ఆయన తనయుడు విజయ్ తమ నివాసంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ పెదబొడ్డేపల్లి క్యాంప్ కార్యాలయంలో, సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో జయరాం అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నర్సీపట్నం అబీద్ సెంటర్‌లో రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రంశెట్టి పాపారావు, సీపీఐ నాయకులు మాకిరెడ్డి రామునాయుడు, బాలేపల్లి వెంకటరమణ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు.

మాకవరపాలెం : మండలంలో పలు గ్రామాల్లో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. బూరుగుపాలెంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, మాకవరపాలెం తహసీల్దార్ కార్యాలయం వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు మర్రినాయుడు, బూరుగుపాలెంలో టీడీపీ నాయకుడు కేతిరెడ్డి చిరంజీవి, తూటిపాల, తామరం, మాకవరపాలెం గ్రామాల్లో ఈ వేడుకలు జరిపారు.

గొలుగొండ/కృష్ణాదేవిపేట : మండలంలో అంబేడ్కర్ జయంతిని జరిపారు. గొలుగొండ, జోగంపేట, పాతమల్లంపేట, గుండుపాల, ఏటిగైరంపేట తదితర గ్రామాల్లో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత నాయకులు చిట్ల చలపతిరావు, జువ్వల దేముడు, సరమండ వీరబాబు తదితరులు పాల్గొన్నారు. కృష్ణాదేవిపేట, చోద్యం, గాదంపాలెం గ్రామాల్లో ఈ వేడుకలను జరిపారు. ఎంపీపీ గజ్జలపు మణికుమారి, ఏఎల్‌పురం సర్పంచ్ లోచల సుజాత, దళిత నాయకులు పాల్గొన్నారు.

నాతవరం : మండల కేంద్రం నాతవరంలో రూ.12 లక్షలతో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహం, అంబేడ్కర్ మెమోరియల్ పార్కును మాజీ ఎంపీపీ ఎస్.విజయ్‌కుమార్ తదితరులు ఆదివారం ప్రారంభించారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఇక్కడ ఈ వేడుకలను జరిపారు. తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, టీడీపీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు బంగారు సూరిబాబు, సర్పంచ్ గొలగాని రాణి, జడ్పీటీసీ కాపారపు అప్పలనర్స, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ ఇటంశెట్టి సీతారామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల/ రూరల్ : పట్టణ శివారు అంబేడ్కర్ కాలనీలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మరువాడ ఈశ్వరరావు, సూర్యనారాయణరాజు, లెక్కల కాశిబాబు పాల్గొన్నారు. అలాగే, గ్రామగ్రామాన అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. వమ్మలిలో రావ్ రాంజీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ సింహాచలం నాయుడు, సంఘ సభ్యులు గాటీలు, శ్రీనివాస్, కొండలరావు, అప్పారావు పాల్గొన్నారు.



బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో బత్తుల తాతయ్యబాబు నివాళి

చీడికాడ : మండల కేంద్రం చీడికాడ తదితర గ్రామాల్లో అంబేడ్కర్ జయంతిని జరిపారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు టీడీపీ, వైసీపీ నాయకులు అంజలి ఘటించారు. కోనాం జలాశయం మాజీ చైర్మన్ గండి ముసలినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోతల చిన్నంనాయుడు, నాయకులు గాలి బాలకృష్ణ, భూసాల దేముడునాయుడు, వైసీపీ నాయకులు పరవాడ మహేష్, గాలి అప్పారావు, బుచ్చిబాబు పాల్గొన్నారు.

దేవరాపల్లి : అంబేడ్కర్ జయంతి సందర్భంగా మండలంలోని వేచలం గ్రామంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని ఈర్లె అనూరాధ, పలువురు మహిళలు నివాళులర్పించారు. అలాగే అంబేడ్కర్ కాలనీలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, సర్పంచ్ పెంటమ్మ, ఎంపీటీసీ కృష్ణమూర్తి, కాటపల్లి అప్పారావు, నివాళులు అర్పించారు.

కె.కోటపాడు : మండల కేంద్రం కె.కోటపాడులో రెల్లి కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. నన్నయ వర్సిటీ మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్ఐ లక్ష్మీనారాయణ, రాష్ట్ర మేధావుల సంఘం అధ్యక్షుడు బండి సురేంద్ర, టీడీపీ నాయకుడు చింత సాంబమూర్తి, కాంగ్రెస్ నాయకుడు వడ్డాది కోటేశ్వరరావు, సర్పంచ్ ఎర్రంశెట్టి భవాని, ఎంపీటీసీ బంగారు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.